నీట్ అక్రమాలపై సీబీఐ

- ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ
- బీహార్, గుజరాత్‌కు సీబీఐ దర్యాప్తు బృందాలు
- మహారాష్ట్రకూ పాకిన నీట్ అక్రమాల లింకులు?
- ఇద్దరు టీచర్లను విచారించిన మహారాష్ట్ర ఏటీఎస్
- డిజిటల్ లాక్‌ల వైఫల్యం వల్ల పరీక్ష ఆలస్యం
- గుర్తించిన బీహార్ ఆర్థిక నేరాల విచారణ విభాగం

న్యూఢిల్లీ, జూన్ 23: నీట్-యూజీ అక్రమాల కేసులో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పేపర్ లీకేజీతో పాటు పరీక్షపై వచ్చిన ఆరోపణల విచారణ బాధ్యతలను సీబీఐకి అప్పగించింది. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆదివారం సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్ 120-బీ(నేరపూరిత కుట్ర), 420(మోసం) కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. పేపర్ లీక్ ఆరోపణలతో కేసులు నమోదైన బీహార్ రాజధాని పట్నాకు, గుజరాత్‌లోని గోధ్రాకు రెండు సీబీఐ బృందాలు వెళ్లాయి. ఈ రెండు రాష్ట్రాల్లో పోలీసులు నమోదు చేసిన కేసుల విచారణను తమ పరిధిలోకి తీసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్టు సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. కాగా, మే 5న దేశ వ్యాప్తంగా జరిగిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందనే ఆరోపణలు రావడం, గతంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 67 మందికి 720 మార్కులకు 720 మార్కులు రావడంతో వివాదం రాజుకుంది. ప్రస్తుతం బీహార్‌లో పేపర్ లీకేజీకి సంబంధించి ఆ రాష్ట్ర పోలీసు శాఖలోని ఆర్థిక నేరాల విచారణ విభాగం దర్యాప్తు ప్రారంభించి పలువురిని అరెస్టు చేసింది.

మహారాష్ట్రలో ఇద్దరు టీచర్ల విచారణ

నీట్-యూజీ పరీక్షలో అక్రమాలతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో ప్రైవేటు కోచింగ్ సెంటర్లను నడుపుతున్న ఇద్దరు టీచర్లను మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) అదుపులోకి తీసుకుంది. శనివారం రాత్రి వీరిని అదుపులోకి తీసుకొని కొన్ని గంటల పాటు విచారించిన తర్వాత వదిలిపెట్టినట్టు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు. మళ్లీ అవసరమైతే వీరిని విచారణకు పిలుస్తామని చెప్పారు. ఈ ఇద్దరిలో ఒకరు ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

నీట్ లీకేజీ కేసులో అరెస్ట్ అయిన మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన టీచర్లు

డిజిటల్ లాక్‌లు పని చేయకపోవడం వల్లే ఆలస్యం

నీట్-యూజీ పరీక్షలకు సంబంధించిన ఆరోపణలపై విచారణ జరుపుతున్న బీహార్ ఆర్థిక నేరాల విచారణ విభాగం కొత్త విషయాన్ని గుర్తించింది. పరీక్షపత్రాలను ఎన్‌టీఏ డిజిటల్ లాక్‌లు కలిగిన ప్రత్యేక బాక్సుల్లో పరీక్షా కేంద్రాలకు పంపిందని, కానీ ఇవి తీరా పరీక్ష మొదలయ్యే సమయానికి తెరుచుకోలేదని పేర్కొన్నది. వాస్తవానికి ఇవి పరీక్ష ప్రారంభానికి ముందు ఆటోమెటిక్‌గా తెరుచుకోవాలి. కానీ, పలు కేంద్రాల్లో డిజిటల్ లాక్‌లు పని చేయకపోవడంతో మాన్యువల్‌గా బాక్సులను తెరవాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులకు ఆలస్యంగా ప్రశ్నాపత్రాలు అందాయి. పరీక్షా సమయాన్ని కోల్పోయిన 1,563 మంది విద్యార్థులకు ఎన్‌టీఏ మొదట గ్రేస్ మార్కులు కలుపగా, అది వివాదంగా మారింది. దీంతో తర్వాత గ్రేస్ మార్కులను తొలగించి, మళ్లీ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

సీబీఐ అధికారులపై దాడి!

పట్నా, జూన్ 23: యూజీసీ-నెట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కేసులో విచారణకు వెళ్లిన సీబీఐ అధికారుల బృందంపై బీహార్‌లో దాడి జరిగినట్టు తెలుస్తున్నది. కేంద్ర విద్యా శాఖ ప్రతిపాదన మేరకు గురువారం యూజీసీ-నెట్ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణలపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో విచారణ జరిపేందుకు శనివారం సాయంత్రం బీహార్‌లోని నవాడా సమీపంలో ఉన్న కసియాదేహ్ గ్రామానికి సీబీఐ అధికారులు వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు స్థానికులు సీబీఐ వాహనాల చుట్టూ గుమిగూడి, అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సీబీఐ అధికారులు స్థానిక రాజౌలి పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి స్థానికులను అడ్డుకున్నారు. ప్రభుత్వ పనికి అడ్డంకులు కల్పించడం, దాడి చేయడం వంటి ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు.

సగం మందే హాజరు

నీట్-యూజీకి రెండోసారి హాజరైంది 52 శాతమే

న్యూఢిల్లీ: గ్రేస్ మార్కులు తొలగించిన 1,563 విద్యార్థులకు ఆదివారం నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ మరోసారి నిర్వహించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏడు పరీక్ష కేంద్రాల్లో పరీక్ష జరిగింది. 1,563 మందికిగానూ 813 మంది, అంటే 52 శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్టు ఎన్‌టీఏ సీనియర్ అధికారి వెల్లడించారు. మే 5న జరిగిన నీట్-యూజీ పరీక్షలో సమయాన్ని కోల్పోయిన 1,563 మంది విద్యార్థులకు మొదట ఎన్‌టీఏ గ్రేస్ మార్కులను కలిపిన సంగతి తెలిసిందే. ఇది వివాదాస్పదం కావడంతో గ్రేస్ మార్కులు తొలగించి, వీరికి మళ్లీ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు హాజరైన వారికి ఇందులో వచ్చిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటామని, హాజరుకాని వారికి గత పరీక్ష మార్కులను(గ్రేస్ మార్కులు మినహాయించిన తర్వాత) పరిగణిస్తామని గతంలోనే ఎన్‌టీఏ స్పష్టత ఇచ్చింది.

మరో 47 మంది విద్యార్థులు డిబార్

నీట్ పరీక్ష అక్రమాల ఆరోపణలపై ఎన్‌టీఏ ఇప్పటికే 63 మంది విద్యార్థులను డిబార్ చేయగా..ఆదివారం బీహార్‌కు చెందిన మరో 17 మందిని, గుజరాత్‌లోని గోధ్రాలో పరీక్ష రాసిన మరో 30 మందిని డిబార్ చేసింది.

ఇద్దరి కోసం పరీక్షా కేంద్రం

ఛండీగఢ్‌లోని ఓ నీట్ యూజీ పరీక్షా కేంద్రం వెలవెలబోయింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఛండీగఢ్‌లో సెక్టార్-44లోని సెయింట్ జోసెఫ్ సీనియర్ సెకండరీ స్కూల్ కేంద్రం కూడా ఒకటి. ఈ కేంద్రంలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంది. ఇందుకు ఎన్‌టీఏ అన్ని ఏర్పాట్లు చేసింది. సిబ్బంది, పోలీసులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. అయితే, పరీక్ష రాయాల్సి ఉన్న ఇద్దరు విద్యార్థులూ పరీక్షకు హాజరుకాలేదు. దీంతో నిబంధనల ప్రకారం 1:30 వరకు చూసి గేట్లు మూసివేశారు. దీంతో పరీక్షా కేంద్రంలో పరీక్ష జరగలేదు.

నేటి నుంచి లోక్‌సభ

- తొలి 2 రోజులు ఎంపీల ప్రమాణం
- 26న లోక్‌సభ కొత్త స్పీకర్ ఎన్నిక
- 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం
- ప్రొటెం స్పీకర్ అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదం

న్యూఢిల్లీ, జూన్ 23: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం నుంచి జరుగనున్నాయి. 24, 25 తేదీల్లో ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో కొత్తగా ఎంపీలుగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుంది. ఆ తర్వాత 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. అనంతరం 27న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై చర్చ జూన్ 28న ప్రారంభం అవుతుందని, ప్రధాని మోదీ జూలై 2 లేదా 3న చర్చకు సమాధానం ఇచ్చే అవకాశం ఉన్నదని పార్లమెంట్ వర్గాలు తెలిపాయి. రాష్ట్రపతి ముర్ము సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన భర్తృహరి మహతాబ్ చేత ప్రమాణం చేయించనున్నారు. . కాగా, ఈ సమావేశాల తర్వాత స్వల్ప విరామం అనంతరం జూలై 22న పూర్తి స్థాయి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఉభయ సభలు తిరిగి సమావేశం కానున్నాయని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి.

దళితుడైనందువల్లే బీజేపీ వివక్ష!

ప్రొటెం స్పీకర్ అంశంపై అధికార ఎన్డీయే, విపక్ష ఇండియా కూటమి మధ్య వివాదం కొనసాగుతున్నది. లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ఏడు సార్లు ఎంపీగా ఎన్నికైన భర్తృహరి మహతాబ్‌ను నియమించినట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల చేసిన ప్రకటనపై ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భర్తృహరి కంటే కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ సీనియర్ అని, దళితుడైనందు వల్లే సురేశ్‌కు ప్రొటెం స్పీకర్ పదవి ఇవ్వలేదని ఆరోపిస్తున్నారు. విపక్షాల ఆరోపణలపై కిరణ్ రిజిజు స్పందిస్తూ ప్రొటెం స్పీకర్‌గా మహతాబ్ ఎంపికను సమర్థించుకున్నారు. మహతాబ్ వరుసగా ఏడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారని, సురేష్ అలా కాలేదని చెప్పారు. సురేశ్ 2004 ముందు నాలుగుసార్లు, ఆ తర్వాత వరుసగా నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రొటెం స్పీకర్ అంశం లోక్‌సభ సమావేశాల్లో హాట్ టాపిక్‌గా మారే అవకాశం కనిపిస్తున్నది.

నక్సల్స్ నకిలీ నోట్ల ముద్రణ!

- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తొలిసారి స్వాధీనం చేసుకొన్న బలగాలు

కొత్తగూడెం క్రైం, జూన్ 23: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో భద్రతా దళాలు ఆదివారం చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో మావోయిస్టుల స్థావరంలో ఆయుధాలతోపాటు దొంగనోట్ల ముద్రణ సామగ్రి దొరకడం సంచలనంగా మారింది. జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా బలగాలు సుక్మా జిల్లాలోని కొరాజ్‌గూడ అడవుల్లో మావోయిస్టుల స్థావరంపై దాడులు చేశారు. అక్కడ నకిలీ నోట్ల పేపర్లు, వాటి తయారీ యంత్రాలు(కలర్ జిరాక్స్, స్కానర్స్), ఇన్వర్టర్, క్యాట్రిడ్జులు, ద్రవ రసాయనాలు లభించాయి. రెండు తుపాకులు, వాకీ టాకీలు, విప్లవ సాహిత్యాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎన్నడూ లేనివిధంగా మావోయిస్టులు నకిలీ నోట్ల ముద్రణకు పాల్పడడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్ల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోనే సుక్మా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతిచెందారు. మరో ఏడుగురి గాయాలయ్యాయి. జగర్‌గుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేకులగూడెం వద్ద ఈ ఘటన చోటుచేసుకొన్నది. మృతిచెందిన జవాన్లు విష్ణు, శైలేందర్ అని పోలీసులు తెలిపారు. మరోవైపు, మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మోస్ట్ వాంటెడ్ నాయకుడు గిరిధర్ తుమ్రెట్టి అలియాస్ బిచ్చు తన భార్య సంగీత అలియాస్ లలితతో కలిసి మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో లొంగిపోయారు.

కర్ణాటకలో మళ్లీ 'డిప్యూటీ' లొల్లి!

- మరోసారి తెరపైకి అదనపు ఉప ముఖ్యమంత్రుల అంశం
- లేవనెత్తిన ముగ్గురు మంత్రులు
- బహిరంగంగానే డిమాండ్లు
- పార్టీలో ముదిరిన అంతర్గత పోరు

బెంగళూరు, జూన్ 23: కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు పరాభవం ఎదురైన నేపథ్యంలో అదనపు డిప్యూటీ సీఎంల లొల్లి మళ్లీ తెరపైకి వచ్చింది. ఉపముఖ్యమంత్రి పదవుల కోసం ప్రజాపనుల మంత్రి సతీశ్ జార్కిహోళి, సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న, మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు. సీఎం సిద్ధరామయ్యపై వారు ఒత్తిడి తెస్తున్నారు. సతీశ్ జార్కిహోళి, కేఎన్ రాజన్న ఎస్టీ వర్గానికి చెందినవారు కాగా, జమీర్ అహ్మద్‌ఖాన్ ముస్లిం. తాజా పరిణామాల నేపథ్యంలో పార్టీలో మళ్లీ అంతర్గత పోరు మొదలైంది.

లోక్‌సభ ఎన్నికల్లో పరాభవం

సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ నాయకత్వంలో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 28 స్థానాలకుగానూ 9 సీట్లను మాత్రమే గెలిచింది. సీఎం సొంత జిల్లా మైసూర్‌లో పార్టీ ఓటమిపాలైంది. అలాగే బెంగళూరు రూరల్ స్థానంలో తన సోదరుడు డీకే సురేశ్‌ను శివకుమార్ గెలిపించుకోలేకపోయారు.

ఎన్నికల ముందు నుంచీ డిమాండ్

అదనపు డిప్యూటీ సీఎంల పోస్టులు ఏర్పాటు చేయాలనే డిమాండ్ లోక్‌సభ ఎన్నికల ముందు నుంచి ఉన్నది.సీనియర్ మంత్రులు జీ పరమేశ్వర, సతీశ్ జార్కిహోళి, హెచ్‌సీ మహదేవప్ప, రాజన్న, కేహెచ్ మునియప్ప తదితరులు డిన్నర్ మీటింగ్ కూడా నిర్వహించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అంతర్గత పోరు ఉన్నదనే ప్రచారం నేపథ్యంలో సిద్ధరామయ్యకు సన్నిహితులైన మంత్రుల నుంచి ఈ 'అదనపు డిప్యూటీ సీఎంల' డిమాండ్ తెరపైకి వచ్చిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. హైకమాండ్ ఈ డిమాండ్లను తోసిపుచ్చింది. అదనపు డిప్యూటీ సీఎంలను నియమిస్తే పార్టీలో డీకే ఆధిపత్యం తగ్గిపోతుందని భావిస్తున్నది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం సిద్ధరామయ్యను తప్పిస్తుందనే ప్రచారముంది.

పురుష కార్యకర్తపై సూరజ్ లైంగిక దాడి!

నిందితుడు ప్రజ్వల్ సోదరుడు

బెంగళూరు: హసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, జేడీ(ఎస్) ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ(37)ను 'అసహజ నేరం(పురుషుడిపై లైంగిక దాడి)' ఆరోపణల కింద కర్ణాటక పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ నెల 16న ఘన్నికడ ఫామ్‌హౌస్‌లో సూరజ్ తనపై లైంగిక దాడి చేశాడని 27 ఏండ్ల జేడీఎస్ పార్టీ కార్యకర్త ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్ ఖండించారు. రూ.5 కోట్లు ఇవ్వకపోతే తప్పుడు ఫిర్యాదు చేస్తానని ఆ కార్యకర్తే తనను బెదిరించాడని పోలీసులకు ప్రతి ఫిర్యాదు చేశారు. చివరికి రూ.2 కోట్లయినా ఇవ్వాలని అతడు తనను బ్లాక్‌మెయిల్ చేశాడని సూరజ్ తెలిపారు. ఈ నేపథ్యంలో కేసును సీఐడీకి అప్పగించినట్టు కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర వెల్లడించారు.

వారంలో మూడోది!

బీహార్‌లో వారం వ్యవధిలో మూడో వంతెన కూలడం ఆందోళన కలిగిస్తున్నది. తూర్పు చంపారన్‌లో నిర్మాణంలో ఉన్న 16 మీటర్ల వంతెన ఆదివారం కుప్పకూలింది. మోతిహారి బ్లాక్‌లో ఘోరసహన్‌లో జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ముప్పు వాటిల్లలేదని జిల్లా అధికారులు వెల్లడించారు. అమ్వా అనే గ్రామాన్ని ఇతర ప్రాంతాలకు కలుపుతూ కెనాల్‌పై ఈ బ్రిడ్జ్‌ను రూరల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నది.

2038 జూలై 12న భూమిని ఢీకొట్టనున్న గ్రహశకలం!

న్యూయార్క్, జూన్ 23: ఓ గ్రహశకలం భవిష్యత్తులో భూమిని ఢీకొట్టే అవకాశం ఉన్నదని నాసా శాస్త్రవేత్తలు గుర్తించారు. 2038 జూలై 12న ఒక గ్రహశకలం భూమిని ఢీకొట్టేందుకు 72 శాతం చాన్స్ ఉన్నదని వెల్లడించారు. జూన్ 20న నాసా మేరీల్యాండ్‌లోని జాన్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ లాబరేటరీలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించింది. ఇంకా 14.25 ఏండ్ల సమయం ఉన్నందున దాన్ని దారి తప్పించేందుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.



ఏఐతో సెక్స్ డాల్స్

తయారుచేస్తున్న చైనా శాస్త్రవేత్తలు

బీజింగ్, జూన్ 23: శారీరక అవసరాలు తీర్చే సెక్స్ డాల్స్‌కు కృత్రిమ మేధ(ఏఐ)ను జత చేసి సెక్స్ రోబోలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు చైనా శాస్త్రవేత్తలు. శరీర వాంఛలను తీర్చడంతో పాటు మాట్లాడ గలిగేలా వీటిని తయారుచేస్తున్నారు. షెన్‌జెన్‌కు చెందిన స్టార్‌పెరీ టెక్నాలజీ అనే సెక్స్ డాల్స్ తయారీ సంస్థ ఈ కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురానున్నది. మగ, ఆడ రూపాల్లో వీటిని తయారుచేస్తున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం పేర్కొన్నది. శారీరక అవసరాలు తీర్చడంతో పాటు వినియోగదారులతో భావోద్వేగ సంబంధాన్ని కలిగి ఉండేలా ఈ కొత్త ఏఐ ఆధారిత సెక్స్ డాల్స్‌ను తయారు చేస్తున్నట్టు స్టార్‌పెరీ టెక్నాలజీ సీఈవో ఈవాన్ లీ తెలిపారు.

'పుష్పక్' హ్యాట్రిక్ సక్సెస్

బెంగళూరు: పునర్వినియోగ వాహకనౌక 'పుష్పక్' ల్యాండింగ్ సామర్థ్యాన్ని మూడోసారి విజయవంతంగా పరీక్షించినట్టు ఇస్రో ప్రకటించింది. ఇప్పటికే రెండుసార్లు ఈ వాహకనౌకను పరీక్షించిన ఇస్రో ఆదివారం ఉదయం 7.10 గంటలకు చివరిసారిగా, మూడోసారి ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్(ఎల్ఈఎక్స్-03)ని విజయవంతంగా పరీక్షించింది. కర్ణాటకలోని చిత్రదుర్గలో ఉన్న ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్) వద్ద ఈ ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో, గగనతలంలో 4.5 కిలోమీటర్ల ఎత్తు నుంచి పుష్పక్‌ను వదిలిపెట్టారు. ఇది ప్రతికూల పరిస్థితులను, పరీక్షలో భాగంగా కల్పించిన అవాంతరాలను ఎదుర్కొని దానికదే ముందుగా నిర్దేశించిన రన్‌వేపై సురక్షితంగా ల్యాండ్ అయ్యింది.

అన్ని ఫోన్లకు ఒకే చార్జర్

కొత్త నిబంధన తీసుకురానున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 23: ఒక్కో బ్రాండ్ ఫోన్‌కు ఒక్కో రకమైన చార్జింగ్ పోర్ట్ ఉండటం మొబైల్ యూజర్లకు పెద్ద సమస్యగా ఉంటుంది. ఈ సమస్యకు త్వరలో పరిష్కారం రాబోతున్నది. ఏ బ్రాండ్ ఫోన్ అయినా టైప్ సీ చార్జింగ్ పోర్ట్ మాత్రమే ఉండేలా కేంద్రం కొత్త మార్గదర్శకాలను అమలులోకి తీసుకురానున్నది. ఈ మేరకు వచ్చే ఏడాది జూన్ వరకు డెడ్‌లైన్ విధించనున్నట్టు తెలుస్తున్నది. అప్పటిలోగా స్మార్ట్‌ఫోన్ల కంపెనీలు అన్ని కొత్త ఉత్పత్తులను సీ టైప్ చార్జింగ్ పోర్ట్‌తో మాత్రమే తయారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ ఈ నిబంధనను అమలు చేస్తున్నది. భారత్‌లో మొదట ఈ నిబంధనను 2025 మార్చి నుంచి అమలు చేయాలని అనుకున్నప్పటికీ ఇప్పుడు ఈ గడువు జూన్‌కు మార్చింది. 2026 చివరి నుంచి ల్యాప్‌టాప్‌లను కూడా సీ టైప్ చార్జింగ్ పోర్ట్‌తో తయారుచేసేలా నిబంధనను రూపొందించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పెద్ద సవాల్‌గా మారిన నేపథ్యంలో ఒకే రకమైన చార్జింగ్ పోర్ట్ విధానం అమలులోకి తేవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా, ఇప్పటికే యాపిల్ సహా చాలా స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు టైప్ సీ చార్జింగ్ పోర్ట్‌లతో తమ ఉత్పత్తులను తయారుచేస్తున్నాయి.



ప్రపంచంలోనే ఒంటరి మొక్క తోడు కోసం ఏఐ అన్వేషణ

కేప్‌టౌన్: ప్రపంచంలోనే ఒంటరిదిగా గుర్తింపు పొందిన మొక్కను పునరుత్పత్తి చేసి వాటి సంఖ్యను పెంచేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఈ పురుష మొక్కకు భాగస్వామిగా ఒక ఆడ మొక్కను అన్వేషిస్తున్నారు. ఈ పనికి కృత్రిమ మేధ(ఏఐ) సాయం కూడా తీసుకుంటున్నారు. ఈ మొక్క పేరు ఎన్సెఫాలార్టోస్ వూడీ. సైకాడ్ జాతికి చెందినది. ఈ జాతి చెట్లు డైనోసర్ల కంటే ముందు నుంచి భూమి మీద ఉన్నాయి. సౌతాఫ్రికాలోని గోయె అటవీ ప్రాంతంలో ఈ అరుదైన మొక్కను గుర్తించారు. అంతరించి పోయే ప్రమాదం ఉన్న ఈ మొక్కను సహజ పద్ధతి ద్వారా పునరుత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఇదే జాతికి చెందిన ఒక ఆడ మొక్క కావాలట. దీని కోసం 10 వేల ఎకరాల గోయె అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు.

ఈ రోబోలను తినేయొచ్చు!

స్విస్ శాస్త్రవేత్తల వినూత్న కృషి



లాసాన్నే (స్విట్జర్లాండ్): ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అరుదైన కలయికతో స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు వినూత్నమైన రోబోలను తయారు చేసేందుకు కృషి చేస్తున్నారు. నిర్దేశించిన పనులను పూర్తిస్థాయిలో చేయగలగడంతోపాటు తినదగినవిగా ఉండటం ఈ రోబోల ప్రత్యేకత. ఈ రోబోల జీవితకాలం ముగిసిన తర్వాత వాటిని ఎంచక్కా నమిలి మింగేయవచ్చు. పోషకాహారాన్ని, మందులను పంపిణీ చేయగలగడంతోపాటు ఆరోగ్యాన్ని పర్యవేక్షించగలిగే ఈ రోబోలు అందుబాటులోకి వస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు గణనీయంగా తగ్గిపోతాయి. నమ్మశక్యం కాని ఈ రోబోలను తయారు చేసేందుకు స్విట్జర్లాండ్‌లోని ఇకోల్ స్పెషల్ డీ లాసాన్నే శాస్త్రవేత్తలు ఇతర యూనివర్సిటీల పరిశోధకులతో కలిసి నడుం బిగించారు. 'రోబో ఫుడ్' ప్రాజెక్టులో భాగంగా వీటిని తయారు చేయనున్నారు. అందుకోసం మెకానికల్ భాగాల స్థానంలో తినదగిన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని నిర్ణయించారు. రబ్బర్‌కు బదులుగా జెలటిన్‌ను, ఫోమ్ స్థానంలో రైస్ కుకీలను, తేమ నుంచి రక్షణ కోసం చాక్లెట్ లాంటి పదార్థాలను వినియోగించనున్నారు. ఇలాంటి పదార్థాల తయారీలో శాస్త్రవేత్తల పురోగతి మందకొడిగా ఉన్నప్పటికీ వారు సాధించిన విజయాలు మాత్రం అద్భుతంగా ఉన్నాయి. 2017లో తినదగిన గ్రిప్పర్‌ను సృష్టించారు. 2022లో రైస్ కుకీ రెక్కలతో ఏకంగా ఓ డ్రోన్‌నే తయారు చేయగలిగారు. నిరుడు రిబోఫ్లావిన్, క్వెర్సెటిన్‌ను ఉపయోగించి తినదగిన బ్యాటరీని అభివృద్ధి చేయగలిగారు. కానీ, రోబోల తయారీకి అవసరమైన భాగాలను తగ్గించడం, వాటిని సూక్ష్మీకరించడం, ఆ రోబోల జీవితకాలాన్ని పొడిగించడం శాస్త్రవేత్తలకు క్లిష్టమైన సవాళ్లుగా మారాయి.

అమెరికాలో కాల్పులు.. తెలుగు యువకుడి మృతి

న్యూఢిల్లీ, జూన్ 23: అమెరికాలోని ఆర్కాన్సాస్ రాష్ట్రంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, మృతుల్లో ఓ తెలుగు యువకుడు ఉన్నాడని తెలిసింది. మృతుడు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన దాసరి గోపీకృష్ణ (32)గా గుర్తించారు. సూపర్ మార్కెట్‌లో బిల్లింగ్ కౌంటర్ వద్ద విధుల్లో ఉన్న అతడిపై ముసుగేసుకొని వచ్చిన ఓ దుండగుడు అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపాడు. శుక్రవారం ఫోర్డైస్ అనే చిన్న పట్టణంలోని మ్యాడ్ బట్చర్ గ్రాసరీ స్టోర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. జీవనోపాధి కోసం 8 నెలల క్రితం అమెరికాకు వెళ్లిన అతడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. దుండగుడు కిరాణా దుకాణం లోపల, పార్కింగ్ వద్ద విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డాడు. నలుగురు వ్యక్తుల ప్రాణాల్ని బలిగొన్నాడు. కాల్పుల్లో మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇవీ సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యింది.

గిరిజనులకు డీఎన్ఏ టెస్ట్ చేయాలి

రాజస్థాన్ మంత్రి వ్యాఖ్యలపై దుమారం

జైపూర్: గిరిజనులకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలంటూ రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై దుమారం రేగుతున్నది. గిరిజనులు హిందువులు కాదన్న బీఏపీ సభ్యుల వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. వారు (గిరిజనులు) హిందువులా? కాదా? అన్న విషయాన్ని నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్ష చేస్తామని పేర్కొన్నారు. బన్సవారా ఎంపీ రాజ్‌కుమార్ రోట్ మాట్లాడుతూ డీఎన్ఏ పరీక్ష కోసం తమ గోళ్లు, వెంట్రుకలు, రక్త నమూనాలను పంపాల్సిందిగా కోరుతూ ప్రచారం ప్రారంభిస్తానని హెచ్చరించారు.

కానిస్టేబుల్‌తో డీఎస్పీ వివాహేతర సంబంధం.. కానిస్టేబుల్‌గా డిమోషన్

లక్నో: మూడేండ్ల క్రితం సహచర మహిళా కానిస్టేబుల్‌తో హోటల్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన ఓ డీఎస్పీకి ఉన్నతాధికారులు తాజాగా కానిస్టేబుల్‌గా డిమోషన్ ఇచ్చారు. యూపీలోని ఉన్నావో లోని కన్నౌజియాలో సర్కిల్ ఆఫీసర్ (సీవో)గా పనిచేస్తున్న కృపా శంకర్ 2021లో సెలవు తీసుకున్నాడు. అయితే, ఆయన ఇంటికి వెళ్లకుండా లేడీ కానిస్టేబుల్‌తో హోటల్‌కు వెళ్లాడు. అతని భార్య ఫిర్యాదుతో పోలీసు బృందం అక్కడికి వెళ్లి లేడీ కానిస్టేబుల్‌తో హోటల్‌లో ఉన్న డీఎస్పీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. కృపాశంకర్‌ను కానిస్టేబుల్‌గా డిమోట్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

అమెరికాలో బర్డ్ ఫ్లూ విజృంభణ

పెంపుడు జంతువులు, వన్యప్రాణులకు వ్యాప్తి

వాషింగ్టన్ : అమెరికాలో బర్డ్ ఫ్లూ విజృంభణ ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవలి వరకు కేవలం పౌల్ట్రీ ఫారాల్లోని కోళ్లు, పక్షులకు మాత్రమే సోకిన ఈ వైరస్‌ను తాజాగా అమెరికాలోని 31 రాష్ట్రాల్లో పిల్లుల్లో కూడా గుర్తించారు. కుక్కలకు కూడా ఈ వైరస్ సోకినట్లు కొన్ని కేసులు నమోదయ్యాయి. దీంతో పెంపుడు జంతువుల యజమానులకు ఈ వైరస్ సోకే ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. అమెరికన్ మీడియా కథనాల ప్రకారం, ఈ వైరస్ 12 రాష్ట్రాల్లోని ఎలుకలు, నక్కలు, పర్వత ప్రాంతాల్లోని సింహాలు, ఆవులకు సోకినట్లు సమాచారం. మేరీల్యాండ్ విశ్వవిద్యాలయంలోని రిసెర్చర్ క్రిస్టెన్ కోల్‌మన్ మాట్లాడుతూ, ఇళ్లలోని పెంపుడు పిల్లులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.